సాక్షి
నల్లగొండ
బుధవారం। 22। ఫిబ్రవరి। 2023



కవలలు.. కనుల పంట
ప్రపంచ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కోదాడలో వీరు ఒకే వేదికపైకి రానున్నారు. - 10లో



ఆస్ట్రేలియాలో.. ప్రదర్శన
ఆస్ట్రేలియాలో జరిగిన ఓ వేడుకలో తెలంగాణ చేనేత వస్త్రాలతో పాటు ఇక్కత్ చీర నేసే సాంకేతికతను ప్రదర్శించారు. - 10లో

గరిష్టం/కనిష్టం
37° / 18°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మాతృభాషను ఆదరించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : మాతృభాషను అందరూ ఆదరించాలని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృబాష కమ్మదనం మరిపోవద్దన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాష మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, డీఈఓ భిక్షపతి, డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ, కవులు, రచయితలు పాల్గొన్నారు.

దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సృజన

నల్లగొండ టౌన్ : మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా పోరాటాడాలని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.సృజన పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమాఖ్య జిల్లా సమితి సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంక్షేమాన్ని విస్మరించి మహిళా చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల వస్తువులు ధరలను పెంచి సామాన్యులపై పెనుభారం మోపిందని విమర్శించారు. సమావేశంలో జి.రమ, ఎం.దుర్గమ్మ, షమీం, మాదగోని సత్తెమ్మ, కలమ్మ, రజిత, సుజాత, పద్మ పాల్గొన్నారు.

పాడితో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు



శిబిరాన్ని ప్రారంభిస్తున్నరాంచందర్‌నాయక్

త్రిపురారం : రైతులు వ్యవసాయంతో పాటు పాడితో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని గిరిజన సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ (ట్రైకార్) ఇస్లావత్ రాంచందర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సత్యనారాయణపురంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు తమ పశువుల ఆరోగ్య పరిస్థితిని పశు వైద్య బృందం ద్వారా పరీక్ష చేయించుకుని సిఫారసు చేసిన మందులను ఉచితంగా పొందాలని సూచించారు. నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, పశు వైద్యాధికారి శశికళ, జ్ఞానేశ్వర్, బహునూతుల నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటాచారి, నగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో 39,380 నివాసాలు

అనుమతి లేకుండానే నిర్మించుకున్న పేదలు
- పట్టణాల్లో 14,670, గ్రామాల్లో 24,710 ఇళ్లను గుర్తించిన అధికారులు
- వాటిని రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు
- నివేదిక అందజేసిన జిల్లా యంత్రాంగం
- నల్లగొండ నియోజకవర్గంలోనే అత్యధికం



ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	పట్టణాలు	గ్రామాలు	మొత్తం
నల్లగొండ	7,193	11,906	19,099
దేవరకొండ	1,849	6,727	8,576
నాగార్జునసాగర్	2,501	591	3,092
మిర్యాలగూడ	2,135	3,619	5,754
మునుగోడు	372	995	1,367
నకిరేకల్	620	872	1,492
మొత్తం	14,670	24,710	39,380

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా నిర్మించుకున్న ఇళ్లను జిల్లా యంత్రాంగం గుర్తించింది. జిల్లాలో అలాంటి ఇళ్లు 39,380 ఉన్నట్లుగా తేల్చింది. ఆ జాబితాను ప్రభుత్వానికి పంపించింది. 12 రకాల ప్రభుత్వ భూముల్లో ఎన్ని ఇళ్లు ఉన్నాయి. అందులో ఏయే భూముల్లోని ఇళ్లను రెగ్యులరైజ్ చేయవచ్చన్న దానిపై ఇటీవల ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమై చర్చించి నిర్ణయం తీసుకుంటుందని భావించినా అది వాయిదా పడింది. త్వరలోనే సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోనుంది. ఆ తర్వాతే జిల్లాలో ఎన్ని ఇళ్లు రెగ్యులరైజ్ అవుతాయి.. ఎన్ని ఇళ్లు కావు అన్న స్పష్టత రానుంది.

సగం వరకు నల్లగొండలోనే..
జిల్లాలో 844 గ్రామపంచాయతీలు, 8 మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటి పరిధిలో 12 రకాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిలో అనుమతులు లేకుండా, ఎలాంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకుండా ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా మండలాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లకు.. మున్సిపాలిటీల్లో కమిషనర్లకు వివరాలు సేకరించే బాధ్యతను అప్పగించారు. మూడు రోజుల పాటు ఆయా రికార్డుల ఆధారంగా వారు ఏయే భూముల్లో ఎంతమంది ఇళ్లు నిర్మించుకున్నారన్న వివరాలను సేకరించి పంపించారు. నియోజకవర్గాల వారీగా నివేదికలను రూపొందించారు. అందులో జిల్లా మొత్తంలో ఉన్న ఇళ్లలో సగం నల్లగొండ నియోజకర్గంలోనే నిర్మించుకున్నట్లు తేలింది. నల్లగొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ భూముల్లో పట్టణాల్లో 7,193 ఇళ్లు నిర్మించగా.. గ్రామాల్లో 11,906 ఇళ్లు ఉన్నాయి. మొత్తం 19,099 ఇళ్లను నిర్మించుకున్నట్లు అధికారులు తేల్చారు.

గ్రామాల్లోనే అత్యధికం..
జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాలు, సాంఘిక సంక్షేమ శాఖ సేకరించిన భూములు, సీలింగ్ ల్యాండ్, మున్సిపాలిటీల్లో ఇటీవల కలిసిన ఆబాదీ/గ్రామ కంఠం భూములు, దేవాదాయ శాఖ భూములు, వక్ఫ్ భూములు, శిఖం/ఎఫ్‌టీఎల్ భూములు, ఇతర ప్రభుత్వ శాఖల భూములు, ప్రభుత్వ లీజ్ భూములు, నోటరీ ల్యాండ్స్, సాదాబైనామాలు, వీటిల్లో కవర్ కాని ఇతర భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలను అధికారులు సేకరించారు. వాటిలో మొత్తం 39,380 మంది ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించుకోగా.. అందులో మున్సిపాలిటీల్లో 14,670, గ్రామాల్లో 24,710 ఇళ్లు ఉన్నాయి.

ఏయే ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తారో..
12 రకాల ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నా.. ప్రభుత్వం చెరువు శిఖం/ఎఫ్‌టీఎల్, ఎండోమెంట్, వక్ఫ్ స్థలాల్లో నిర్మించుకున్న వాటిని మినహాయించి మిగతా వాటిల్లోని ఇళ్లను మాత్రమే రెగ్యులరైజ్ చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకునేందుకు సోమవారం కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం కావాల్సి ఉన్నా వాయిదా పడటంతో నిర్ణయం తీసుకోలేదు. త్వరలోనే సమావేశం జరిగాక వీటిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

● నృసింహుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ప్రధానాలయం ముఖ మండపంలో పూజలు చేస్తున్న అర్చకులు

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

● కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

కేతేపల్లి : హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని వన నర్సరీని మంగళవారం ఆయన పరిశీలించారు. నర్సరీలో 50శాతం మొక్కలు మాత్రమే ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని నర్సరీల్లో వచ్చే జూన్ నాటికి మొక్కలను అందుబాటులోకి తీసుకరావాలని సూచించారు. మొలకెత్తని విత్తనాల స్థానంలో కొత్త విత్తనాలు నాటాలని, ఎత్తుగా పెరిగిన మొక్కలకు సపోర్టుగా కర్రలు కట్టాలని చెప్పారు. గ్రామాల్లో రోజూ 100 మందికి పైగా కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాల్, గుడివాడ సర్పంచ్ కట్ట శ్రవణ్, తదితరులు ఉన్నారు.

రాజీవ్ స్వగృహ 4వ విడత వేలం



శ్రీవల్లి టౌన్ షిప్ వద్ద ఔత్సాహికులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

- మార్చి 16, 17, 18 తేదీల్లో నిర్వహణ
- ఈనెల 28న, వచ్చే నెల 10న కలెక్టరేట్‌లో ప్రీబిడ్ సమావేశాలు

నల్లగొండ : మార్చి 16, 17, 18 తేదీల్లో రాజీవ్ స్వగృహ (శ్రీ వల్లి టౌన్‌షిప్)లో మిగిలిన ఓపెన్ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాల 4వ విడత బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలోని రాజీవ్ స్వగృహలో 133 ఓపెన్ ప్లాట్లు, 252 పాక్షిక నిర్మాణ గృహాలు వేలానికి పెట్టామని వెల్లడించారు. బహిరంగ వేలానికి సంబంధించి ఈ నెల 28న, మార్చి 10వ తేదీన ప్రీబిడ్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ ప్లాట్లకు చదరపు గజానికి రూ.6 వేలు, పాక్షిక నిర్మాణ గృహాలకు రూ.10,500 కనీస ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. మూడు విడతలుగా నిర్వహించిన వేలంలో మంచి స్పందన వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అరుదైన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఎటువంటి చిక్కులు లేని ప్లాట్లను సొంతం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం టౌన్‌షిప్‌లో మౌలిక సదుపాయాలు, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.2.70 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.10 వేలు ఈఎండీ, కలెక్టర్ పేరున చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ షఫీ (ఫోన్ నంబర్ 91543 39209)ని సంప్రదించవచ్చని సూచించారు.

టౌన్ షిప్ సందర్శన..
రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్ షిప్‌ను మంగళవారం ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో సందర్శించారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, వివిధ శాఖల అధికారులను అక్కడ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మూగజీవాల రోదన

- పశువులకు సమయానికి అందని వైద్యం
- వైద్య కేంద్రాల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత
- సక్రమంగా సరఫరాకాని మందులు



నల్లగొండ అగ్రికల్చర్ : వైద్యం సమయానికి అందక మూగజీవాలు అల్లాడుతున్నాయి. జిల్లాలోని పశు వైద్య కేంద్రాల్లో డాక్టర్లు, కంపౌండర్లు, సిబ్బంది తోపాటు మందుల కొరత పట్టి పీడిస్తోంది. దీంతో నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది తమ పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, ఇతర జీవాలకు నాటు వైద్యంతోనే సరిపెట్టుకుంటున్నారు. తెలిసీతెలియని నాటు వైద్యంతో మూగ జీవాలు అరణ్యరోదన అనుభవిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం, మందులు సక్రమంగా సరఫరా చేయకుండా పశు సంవర్ధక శాఖను చిన్నచూపు చూస్తోంది. ఇప్పటి వరకు జిల్లాకు సరఫరా చేయాల్సిన మందుల్లో సగం మాత్రమే ప్రభుత్వం ఇవ్వడంతో ఉన్న మందులతోనే పశువైద్యులు సరిపుచ్చుతున్నారు. అనేక ఆస్పత్రుల్లో రైతుల నుంచే మందులు కొనుగోలు చేయిస్తున్నారు.

మూగజీవాలు ఇలా..

తెల్లజాతి	2,06,585
నల్లజాతి	3,17,279
గొర్రెలు	11,16,617
మేకలు	3,44,774
కోళ్లు	44,33,639

42 పోస్టులు ఖాళీ..
జిల్లాలో ఒక జిల్లా బహుళార్థక పశువైద్యశాల, 5 తాలూకా పశు వైద్యశాలలు, 56 పశువైద్య కేంద్రాలు, 59 గ్రామీణ పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. జిల్లా డీడీ డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌కు వెళ్లగా.. ఇన్‌చార్జిగా ఏడీ వ్యవహరిస్తున్నారు. పశువైద్యులు 17, ఎల్ఎస్ఏ 42, అటెండర్ పోస్టులు 75 కలిపి మొత్తం 135 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గణాంకాలు చెపుతున్నాయి. అయితే మండల పశువైద్య కేంద్రాల్లో చాలా వరకు డాక్టర్లు లేకపోవడంతో సిబ్బందే వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామీణ పశువైద్య కేంద్రాల్లో కూడా చాలాచోట్ల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు లేకపోవడంతో సరైన వైద్య సేవలు అందడంలేదు. కొన్నిచోట్ల డాక్టర్లు, కంపౌండర్లు, సరిపడా మందులు లేని కారణంగా పశువైద్య కేంద్రాలు నిరుపయోగంగా ఉంటున్నాయి.

మందులకు కొరత లేదు
పశు వైద్యులు, ఇతర సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. జిల్లా వ్యాప్తంగా 135 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న వారితో సరైన వైద్యం అందించే ప్రయత్నం చేస్తున్నాం. పశువైద్య కేంద్రాలకు మూడు నెలలకోరావాల్సిన మందులు బాగానే వస్తున్నాయి. అత్యవసరమైన మందులు అందుబాటులో లేని సమయంలో రైతుల నుంచి కొనుగోలు చేయిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ అంబటి యాదగిరి, జిల్లా పశువైద్యాధికారి

విధుల్లో కొందరి నిర్లక్ష్యం..
పశు సంవర్ధక శాఖలో ఉన్న కాస్త సిబ్బంది కూడా సక్రమంగా పనిచేయకుండా విధులకు ఎగనామం పెడుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని పలువురు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పశువైద్యం అందించాల్సిన డాక్టర్లు, సిబ్బంది జిల్లా కేంద్రంలో నివాసం ఉంటూ ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. దీనికి పైస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కూడా తోడుకావడంతో గ్రామాల్లో పశువైద్యం పూర్తిగా కుంటుపడుతోందని పలువురు పేర్కొంటున్నారు.

ప్రకృతివనాలకు భూములు గుర్తించాలి

● అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నల్లగొండ : బృహత్ పల్లె ప్రకతి వనాల ఏర్పాటుకు భూములు గుర్తించాలని, గ్రౌండింగ్ చేసిన వాటిని వెంటనే పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఎంపీఓలు, అదనపు ప్రోగ్రాం అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు అవగాహన, నర్సరీలు, ఆస్తి పన్ను వసూలు, సోషల్ ఆడిట్ రికవరీస్, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, హరితహారం, బృహత్ పల్లె ప్రకతి వనాల పనులు, సీసీ రోడ్ల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో 50 మందికి తక్కువ కాకుండా కూలీలు పనికి వచ్చేలా చూడాలని ఆదేశించారు. పరిపాలన అనుమతి పొందిన అన్ని సీసీ రోడ్లను వెంటనే గ్రౌండింగ్ చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్తి పన్నులో 8 శాతం గ్రంథాలయ సెస్ జమ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, డీపీఓ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

1న గిరిజన సంఘం బహిరంగ సభ

మిర్యాలగూడ అర్బన్ : మార్చి 1, 2, 3 తేదీల్లో మిర్యాలగూడలో జరిగే తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభల సందర్భంగా 1వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1వ తేదీన హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి భారీ ర్యాలీ తీసిన అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు మాజీ ఎంపీ, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకురాలు బృందాకారత్, మాజీ ఎంపీ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ధర్మానాయక్, ఆర్.శ్రీరాం నాయక్ హాజరవుతారని తెలిపారు. సభకు గిరిజనులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల రవి, డబ్బీకార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, మంగారెడ్డి, అయ్యూబ్, అరుణ, ఏసు, సైదానాయక్, సైదులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

రాజకీయాన్ని వృత్తిగా స్వీకరించాలి

● డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్



పాదయాత్ర చేస్తున్న విశారదన్ మహారాజ్

కట్టంగూర్ : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు రాజకీయాలు చేయటమే వృత్తిగా స్వీకరించాలని డీఎస్‌పీ (దళిత శక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. తెలంగాణలో అట్టడుగు కులాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజ్యం కోసం చేపట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర మంగళవారం మండలంలోని అయిటిపాముల, కట్టంగూర్, పరడ, కల్మెర గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో డీఎస్‌పీ జెండాలు, శిలాఫలకాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయాలు చేయడం అగ్రకులాలైన రెడ్డి, రావు, కమ్మ, కాపు సొత్తుకాదన్నారు. 90 శాతం మంది ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లతో 10 శాతం మంది లేని అగ్రకులాలు పెత్తనం చెలాయిస్తున్నాయన్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు పండించే సబ్బండ కులాలకు అన్నం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఓట్లతో మనమే ప్రభుత్వం స్థాపించుకుంటే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సైదులు, సీహెచ్ గిరి, వంశీ, సాయి, లక్ష్మణ్, బాలయ్య, శేఖర్, మురళి తదితరులు ఉన్నారు.

గొప్ప ఆధ్యాత్మికవేత్త సంత్ సేవాలాల్

● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

మిర్యాలగూడ : దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సేవాలాల్ 284వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద గల బంజారా భవన్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఎలా బతకాలో నేర్పిన సంత్ సేవాలాల్ జీవితాన్ని అందరూ ఆచరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన రిజర్వేషన్లు 6 శాతం నుంచి 10 శాతానికి ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ చెన్నయ్య, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, ఎంపీపీలు ధీరావత్ నందినిరవితేజ, నూకల సరళహనుమంతరెడ్డి, భగవాన్‌నాయక్, జెడ్పీటీసీలు ఆంగోతు లలితహాతీరాంనాయక్, సేవ్యానాయక్, చిట్టిబాబునాయక్, సైకిలాబ్‌నాయక్, మేఘ్యానాయక్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, వింజం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ మార్చాలని విద్యార్థుల ధర్నా



ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీపీ, తహసీల్దార్

మునుగోడు : తమకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న ఏజెన్సీ నిర్వాహకులను వెంటనే తొలగించి, నూతన ఏజెన్సీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. కొద్ది నెలలుగా తమకు రుచికరమైన కూరలు వండిపెట్టడం లేదని, గుడ్డు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రశ్నిస్తే బూతులు తిడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కర్నాటి స్వామి, తహసీల్దార్ ఎం. కృష్ణారెడ్డి, ఎంపీఓ సుమలత, సర్పంచ్ మిర్యాల వెంకన్న, ఎస్ఎంసీ చైర్మన్ వందుల పాపయ్యలు అక్కడికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. మెనూ ప్రకారం రుచికరమైన కూరలు వండిపెట్టాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

23న ఎంజీయూలో జాబ్‌మేళా

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ)లో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఆపై చదివిన వారు, 2022 విద్యా సంవత్సరంలో పాస్ అయిన వారు కూడా ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. ఉదయం 9గంటల నుంచి రాతపరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని సూచించారు.

నృసింహుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- ఆరేళ్ల తర్వాత ప్రధానాలయంలో ఉత్సవాలు
- విశ్వక్సేనారాధన, స్వస్తి వాచనం, అంకురారోపణం పూజలు చేసిన ఆచార్యులు
- నేడు అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరి పూజ, దేవతాహ్వానం


అంకురార్పణ సామగ్రితో స్వయంభు వద్ద పూజలు చేసేందుకు వెళ్తున్న ఈఓ, అర్చకులు, అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం మంగళవారం ప్రధానాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 10గంటలకు ప్రధాన ఆలయంలోని స్వయంభూలకు పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనారాధన, స్వస్తి వాచనం, రక్షాబంధనం, అంకురారోపణం వంటి పూజలు జరిపించారు. తొలి పూజలో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు. వారి వెంట ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, యజ్ఞాచార్యులు, అర్చక బృందం, పారాయణీకులు ఉన్నారు.

ఉదయం విశ్వక్సేనారాధనతో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 10గంటలకు గర్భాలయంలోకి స్వయంభూలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల చెంత విశ్వక్సేనారాధతో ఉత్సవాలను ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు.

స్వస్తి వాచనం..

వార్షిక బ్రహ్మోత్సవములు నిర్వహించే సమయంలో ఆగమ శాస్త్రానుసారం స్వస్తి వాచనంతో వైదిక కార్యక్రమాలు ప్రారంభించడం ఆనవాయితీ. స్వస్తీ వాచన మంత్ర జలాన్ని గర్భాలయంలో, ఉప ఆలయాల్లో, ముఖ మండపంలో, ధ్వజ స్తంభానికి, ఆలయ తిరుమాఢ వీధుల్లో, ఆలయ పరిసరాల్లో, భక్తులపై ప్రోక్షణ గావించారు.

రక్షాబంధనం..

విశ్వక్సేనారాధన, స్వస్తి వాచనం పూర్తయిన తర్వాత ఆచార్యులు రక్షాబంధనం పూజలు జరిపించారు. తొలుత గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా బంగారు కవచ మూర్తులకు రక్షాబంధనం గావించారు. అనంతరం ఉప ఆలయాల్లోని ఆండాళ్ అమ్మవారికి, ఆళ్వారులకు, విష్వక్సేనుడికి రక్షాబంధనం గావించి, ముఖ మండపంలోని ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేశారు. తర్వాత ఉత్సవ నిర్వాహకులు, భక్తులకు ఈ రక్షాబంధనం కట్టారు.

నేడు అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానం, హవనం వంటి పూజలు జరిపిస్తారు.

సాయంత్రం అంకురారోపణం..

సాయంత్రం నిత్యారాధనల అనంతరం మృత్సంగ్రహణం (పుట్ట మన్ను) సేకరించు వేడుకతో పాటు అంకురారోపణం వేడుకలను నిర్వహించారు. భూసూక్తముతో భూదేవిని అర్చించి మృత్తికను సేకరించి యాగశాలకు చేర్చారు. అనంతరం పుట్ట మన్నును మంత్ర జలములతో ప్రోక్షణ గావించి పాలికలో నవధాన్యాలు, పుట్ట మన్ను నింపి ఆరాధాన గావించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


ఈఓ గీతారెడ్డికి పట్టువస్త్రాలను అందజేస్తున్న పోచంపల్లి చేనేత కార్మికులు


ఉత్సవమూర్తులకు సంప్రోక్షణ చేస్తున్న ప్రధానార్చకులు

స్వామివారికి పోచంపల్లి పట్టువస్త్రాలు..

భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట: యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు బహూకరిస్తుంటారు. ఈ మేరకు మంగళవారం పోచంపల్లిలోని శ్రీమార్కండేశ్వర స్వామి దేవాలయంలో పట్టువస్త్రాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజనలు, కీర్తనలతో ప్రదర్శనగా యాదాద్రికి వెళ్లి ఈఓ గీతారెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తికి రెండు పట్టు చీరలు, పట్టు పంచెలు, రెండు శాలువాలను అందజేశారు. అదేవిధంగా మార్కండేశ్వర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో పోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షుడు అంకం మురళి, మార్కండేయస్వామి ఆలయ చైర్మన్ బడుగు చండీకేశ్వర్, నాయకులు తడక వెంకటేశం, తడక రమేశ్, భోగ నర్సింహ, బాలరత్నం, గంజి అంజయ్య, వనం మల్లేశ్, కర్నాటి అంజమ్మ, గుండు పాండు, కర్నాటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి బంగారు ఆభరణాలు బహూకరణ


ఆలయ ఈఓ గీతారెడ్డికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లకు మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లకు చెందిన సత్తూరు సుందరమ్మ కుటుంబ సభ్యులు రూ.22లక్షల విలువైన బంగారు ఆభరణాలను బహూకరించారు. ఆండాళ్ అమ్మవారికి రంగ నాయక హారం, లక్ష్మీదేవికి దశావతార హారంతో పాటు స్వామి వారికి డైమండ్ పచ్చల హారాన్ని తయారు చేయించి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తిలకు అందజేశారు.


ప్రధానాలయం లో భక్తుల రద్దీ

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


సైదులు (ఫైల్)

రామగిరి(నల్లగొండ): అప్పుల బాధతో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కేశరాజుపల్లి సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశరాజుపల్లికి చెందిన బొజ్జ సైదులు(35) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగుతుండడంతో మంగళవారం రాత్రి కేశరాజుపల్లి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ పి. మునీశ్వర్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య జ్యోతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ అర్బన్: లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని చర్చి బజార్‌కు చెందిన విజయ్(35) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా విజయ్ మద్యానికి బానిసై ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మిర్యాలగూడ పట్టణంలో నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్ రోడ్డు దాటుతుండగా లారీ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా విజయ్ లారీ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని లారీ డ్రైవర్ చెబుతుండగా.. రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ ఢీకొని మృతి చెందాడని మృతుడి అన్న రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి బలవన్మరణం


శివప్రసాద్ (ఫైల్)

కేతేపల్లి: పురుగు మందు తాగి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్కుపల్లి గ్రామానికి చెందిన కుంచం శివప్రసాద్(28) తన సొంత కారును కిరాయిలకు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మంగళవారం చెర్కుపల్లి నుంచి భీమారం గ్రామానికి వెళ్లిన శివప్రసాద్ తిరిగి ఇంటికి వస్తూ భీమారం గ్రామ శివారులో దారి వెంట పురుగు మందు తాగాడు. అనంతరం శివప్రసాద్ తన సోదరుడికి ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగిన విషయాన్ని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూసేసరికి శివప్రసాద్ విగతజీవిగా పడి ఉన్నాడు. శివప్రసాద్ ఆత్మహత్య చేసుకోవటానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేతేపల్లి ఎస్‌ఐ ఎం. అనిల్‌రెడ్డి తెలిపారు.

పరారైన ఖైదీకి జైలు శిక్ష, జరిమానా

మిర్యాలగూడ టౌన్: పోలీసుల కళ్లుగప్పి పరారైన నిందితుడికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.7వేల జరిమానా విధిస్తూ మిర్యాలగూడ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ నాగ సుమబాల సోమవారం తీర్పునిచ్చారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాకు చెందిన అయితం రవిశంకర్‌ను 2022లో ఓ కేసు విషయమై పోలీసులు మిర్యాలగూడ కోర్టుకు తీసుకొచ్చారు. అదే సమయంలో పోలీసుల కళ్లుగప్పి అతడు పరారయ్యాడు. దీంతో వన్ టౌన్ సీఐ రాఘవేందర్ నిందితుడిని పట్టుకొని కేసు నమోదు చేశారు. వన్ టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ కోర్టులో చార్జిషీట్ వేయగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జి. సుధాకర్ వాదనలు వినిపించగా, అతడికి కోర్టు కానిస్టేబుల్ పెద్ది రాజు సహకరించారు.

మహిళను వేధించిన కేసులో మూడు నెలల జైలు

మహిళను వేధించిన కేసులో నిందితుడికి మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.3500 జరిమానా విధిస్తూ మిర్యాలగూడ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నాగ సుమబాల తీర్పునిచ్చారు. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన బొమ్మకంటి శివ 2017లో ఓ మహిళను వేధింపులకు గురిచేయడంతో బాధితురాలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన అప్పటి వన్ టౌన్ ఎస్‌ఐ రామాంజనేయులు కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్ వేశారు. ఈ కేసును పూర్తిస్థాయిలో విచారించగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడు నెలలు జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఖననం చేసిన మృతదేహానికి పంచనామా

పెద్దఅడిశర్లపల్లి: ఖననం చేసిన మృతదేహానికి పంచనామా చేసిన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మేడారం గ్రామానికి చెందిన మానుపాటి అంజనేయులు(45) ఈ నెల 19న యల్లాపురం గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు అదే రోజు అంజనేయులు మృతదేహాన్ని ఖననం చేశారు. కాగా మంగళవారం మృతుడి కుమారుడు అనిల్ తన తండ్రి మృతిపై అనుమానాలు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి తహసీల్దార్ అంజనేయులు, దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల సమక్షంలో మృతదేహానికి పంచనామా చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాయమాటలు చెప్పి పుస్తెలతాడు అపహరణ


నకిలీ బంగారం ముద్ద

మద్దిరాల: గుర్తుతెలియని వ్యక్తులు మహిళకు మాయ మాటలు చెప్పి పుస్తెల తాడు అపహరించిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండల కేంద్రానికి చెందిన యరుకలి రాధిక, సైదులు దంపతులు స్థానికంగా కిరాణ షాపు నడిపిస్తున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి గుర్తుతెలియని మహిళ, వ్యక్తి కిరాణ సామాను కోసం షాపు వద్దకు వస్తూ పక్కనే డ్రిల్లింగ్ పనులు చేస్తున్నామని వారితో పరిచయం పెంచుకున్నారు. మంగళవారం మరోసారి షాపు వద్దకు వచ్చిన సదరు మహిళ, వ్యక్తి యాదగిరిగుట్టలో డ్రిల్లింగ్ చేస్తుండగా తమకు బంగారం ముద్ద దొరికిందని, దానిని అమ్మి పెట్టాలని రాధిక, సైదులు దంపతులకు చెప్పారు. దీంతో సైదులు ఆ బంగారం ముద్దను చెక్ చేయిస్తానని స్థానిక జ్యూయలరీ షాపు వద్దకు తీసుకెళ్లాడు. అదే సమయంలో షాపు వద్ద ఉన్న రాధికతో 'మేము అంత బంగారం ముద్ద ఇచ్చాము కదా.. నీ భర్త వచ్చే వరకు గ్యారంటీ కొరకు నీ మెడలోని బంగారపు పుస్తెలతాడు ఇవ్వమని' నమ్మించి 4.5 తులాల పుస్తెలతాడును తీసుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్న తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


అలివేలు (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని అజ్మాపురం గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అజ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కొట్టాలగడ్డ గ్రామానికి చెందిన ఇరిగి అలివేలు(35) మంగళవారం ఉదయం తన ఇంటి వద్ద బట్టలు ఆరేస్తుండగా కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దేవరకొండ: పట్టణ శివారులోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటాయని, బూడిద రంగు ప్యాంట్, నారింజ రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440795604 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనివాస్ సూచించారు.

ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా

- క్లీనర్ మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు


క్లీనర్ శివ మృతదేహం

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడడంతో క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందగా, డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లాలోని నర్సాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడిపల్లిగూడేనికి ధాన్యం లోడు వెళ్తున్న లారీ తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ కాలనీ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన లారీ క్లీనర్ శివ అక్కడికక్కడే మృతిచెందగా, కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన డ్రైవర్ జానీకి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని శివ మృతదేహాన్ని, క్షతగాత్రుడిని సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బీబీనగర్: మండలంలోని పగిడిపల్లి సమీపంలో ఈ నెల 1వ తేదీన గుర్తుతెలియని రైలు కింద పడి గాయాలపాలైన సుమారు 50సంవత్సరాల వ్యక్తి హైదరాబాద్‌లోని గాంధీలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు జీఆర్‌పీ ఐఓ మునేశ్వర్‌రావు తెలిపారు.